ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 04.09.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో వరద ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

2. రాష్ట్రంలో పారిశుధ్య నిర్వహణ , తాగు నీటి సరఫరా , రహదారుల పునరుద్ధరణకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

3. కృత్రిమ మేధ , పరిజ్ఞానాలు, సంబంధిత అంశాలపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు రేపటి నుంచి హైదరాబాద్ లో జరుగుతుంది.

4. పారిస్ వేదికగా జరుగుతోన్న పారాలింపిక్స్ లో దేశానికి పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.

వరద -సహాయక చర్యలు

రాష్ట్రంలో వరద ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. మూడు రోజులుగా కురిసిన వర్షాలు తెరిపినివ్వడంతో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. దెబ్బతిన్న రోడ్లు, రైల్వే లైన్ల మరమ్మత్తులు, విద్యుత్ పునరుద్ధరణతో పాటు ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నారు. అదే

సమయంలో వరదల వల్ల ఆస్తి , పంట నష్టాలను అధికారులు అంచనా వేస్తున్నారు. ముంపుకు గురైన ఖమ్మం మున్నేరు ప్రాంతంలో ఇప్పుడిప్పుడే వరద తగ్గుముఖం పడుతోంది. దీంతో అధికారులు , పోలీసు సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలోకి భారీగా చేరిన బురదను వాటర్ ట్యాంకర్ల ద్వారా తొలగిస్తున్నారు. రోడ్లపై విరిగి పడిన విద్యుత్ స్తంభాలు తొలగించి, విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తున్నారు. ధంసలాపురం , శ్రీనివాస్ నగర్, ప్రకాశ్ నగర్, రాజీవ్ గృహకల్ప , జలగం నగర్, కవిరాజ్ నగర్, బొక్కలగడ్డ ముంపు ప్రాంతాలలో పారిశుధ్య కార్మికులతో కలిసి, 525 మంది ట్రైనీ కానిస్టేబుళ్ల సహాయక చర్యలు చేపట్టారు.

డెస్క్/ PTC, khammam)

సీతక్క-సమీక్ష

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రతి మండలానికి ఐదు గురు అధికారులతో ఫ్లడ్ మేనేజ్ మెంట్ కమిటీలు ఏర్పాటు చేయాలని పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచి నీటి సరఫరా శాఖలపై ఈ రోజు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జిల్లా అధికారులతో టెలి కాన్ఫరెన్స్ లో మాట్లాడిన మంత్రి భారీ వర్షాల నేపథ్యంలో శాఖల వారిగా చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పారిశుధ్య నిర్వహణ , తాగు నీటి సరఫరా , రహదారుల పునరుద్ధరణ పై సూచనలు చేసిన మంత్రి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని వెల్లడించారు.. గ్రామాల్లో చెరువులు , వాగులు, కాలువల పై వెలసిన అక్రమ కట్టడాల జాబితాను జిల్లా కలెక్టర్ కు అందచేయాలని కూడా ఆదేశించారు. ఈ కష్టకాలంలో ప్రజలకు తోడుగా నిలవాలని సిబ్బందికి సూచించారు.

(డెస్క్)

AI సదస్సు:

కృత్రిమ మేథ, పరిజ్ఞానాలు, సంబంధిత అంశాలపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు రేపటి నుంచి హైదరాబాద్ లో జరుగుతుంది. "ప్రతి ఒక్కరికోసం కృత్రిమమేధ " అనే ఇతివృత్తంతో హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ లో జరిగే ఈ సదస్సును ముఖ్యమంత్రి A రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా వివిధ రంగాల్లో AI సేవల అబివృద్ధి అవకాశాలు, భవిష్యత్తు కార్యాచరణ కు సంబంధించి దాదాపు 25 కార్యక్రమాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రోడ్ మ్యాప్ ను విడుదల చేయనుంది. ప్రపంచస్థాయిలో కృత్రిమ మేధ సదస్సును నిర్వహించటం దేశం లో ఇదే మొదటిసారి అని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. వివిధ దేశాలనుంచి AI రంగ నిపుణులు 2 వేల మంది పైగా సదస్సులో పాల్గొని , ఏఐ రంగం అభివృద్ధికి తమ ఆలోచనలను పంచుకుంటారు. సామాజిక బాధ్యత గా సమాజం పై AI ప్రభావం, నియంత్రణ, సవాళ్ల ను చర్చిస్తారు.

(MSL)

పెద్దపల్లి-శ్రీధర్ బాబు

పెద్దపల్లి జిల్లాలోని వరద ముంపు ప్రాంతాల ప్రజలు , అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును పరిశీలించిన మంత్రి ఎగువ న కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు నిండుకుండలా మారుతుందని , ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు సామ్యర్థం ఇన్ ఫ్లో , ఔట్ ఫ్లో తీరును పరిశీలించి, ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని సూచించారు.

(పెద్దపలి, పీటీసీ)

వరద-విరాళాలు

ఖమ్మం వరద బాధితులకు ఆదుకోవడానికి బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్యేల , ఎంపి ల ఒక నెల జీతం విరాళంగా ఇస్తున్నట్టు ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే హరీష్ ప్రకటించారు. తెలుగు

రాష్ట్రాల్లో వరద బాధితులను ఆదుకునేందుకు సినీ ప్రముఖులు చిరంజీవి, బాలక్రుష్ణ, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్ , ప్రభాస్, అల్లు అర్జున్, తదతిరులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల సహాయ నిధికి 50 లక్షల రూపాయల చొప్పున విరాళం ప్రకటించారు. దర్శకుడు త్రివిక్రమ్ , నిర్మాతలు సూర్యదేవర రాధాకృష్ణ , నాగవంశీ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయనిధికి 25 లక్షల చొప్పున విరాళం అందజేస్తున్నట్టు తెలిపారు. కాగా, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలుగు రాష్ట్రాలకు చెరో 10 లక్షల రూపాయల చొప్పున విరాళం ప్రకటించి ఈ మొత్తాన్ని చెక్కుల రూపంలో ఢిల్లీలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ భవన్‌ల రెసిడెంట్ కమిషనర్లకు అందజేశారు. ఈ కష్ట కాలంలో ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి తమకు చేతనైనంత సాయం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

(డెస్క్)

భద్రాచలం-గోదావరి

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు భద్రాద్రి కొత్త గూడెం జిల్లా భద్రాచలం వద్ద గోదావరి నది నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం మొదటి ప్రమాద హెచ్చరికకు అతి చేరువగా గోదావరి ఉధృతి కొనసాగుతోంది. 9 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన జిల్లా కలెక్టర్ , ఎస్పీ, ఐటీడీఏ పీవో ప్రజలు సెల్ఫీల కోసం వాగులు , వంకలు, నదులు వద్దకు వెళ్ళొద్దని.. వరద నీటితో నిండిపోయిన రోడ్లను దాటడానికి ప్రయత్నించవద్దని ప్రజలకు సూచించారు. వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాలని తెలిపారు.

(పీటీసీ, కొత్తగూడెం)

సహాయ చర్యలు-పొన్నం

భారీ వర్షాలు , విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో సహా మంత్రులు , ప్రజా ప్రతినిధులు సహాయ , పునరావాస కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారని తెలిపారు. అధికారులంతా స్థానికంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించామని, పార్టీ శ్రేణులు కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నా ప్రజలకు అండగా ఉండే బాధ్యత గల ప్రభుత్వంగా తాము అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని , కేంద్రం నుంచి సహకారం కూడా కోరుతున్నామని చెప్పారు.

(పీఎన్)

దీప్తి-సీఎం

పారిస్ వేదికగా జరుగుతోన్న పారాలింపిక్స్ లో దేశానికి పతకం సాధించిన తెలంగాణ క్రీడాకారిణి జీవాంజి దీప్తికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. పారాలింపిక్స్ మహిళల 400 మీటర్ల టీ20 రేసులో దీప్తి కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. నిన్న రాత్రి జరిగిన ఫైనల్లో 55.82 సెకన్లలో పరుగును పూర్తి చేసి మూడో స్థానాన్ని సాధించారు. ప్రతిభకు వైకల్యం అడ్డురాదని నిరూపిస్తూ విశ్వ క్రీడా వేదికపై విజేతగా నిలిచిన దీప్తి మనందరికీ గొప్ప స్ఫూర్తి అని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు. పారాలింపిక్స్ 2024లో పతకాలు సాధించిన భారత క్రీడాకారులందరికీ ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

(డెస్క్)

పీఐబీ వర్క్ షాప్- ఈటెల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే గురుతర బాధ్యత పాత్రికేయులపై ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఈ

రోజు మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో కేంద్ర సమాచార , ప్రసార మంత్రిత్వ శాఖ పత్రికా సమాచార కార్యాలయం ఆధ్వర్యంలో పాత్రికేయులకు ఒకరోజు వర్క్ షాప్ ను రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో అనుమానాలు , అయోమయం లేకుండా అభివృద్ధి పథకాలపై నిష్పాక్షికంగా వార్తలు అందించాలని సూచించారు. కేంద్ర సమాచార కార్యాలయం అదనపు డైరెక్టర్ జనరల్ శ్రుతి పాటిల్ మాట్లాడుతూ వర్క్ షాప్ ప్రాధాన్యతను వివరించారు.

(పీటీసీ, మేడ్చల్)

మంచిర్యాల-పంట నష్టం

మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 186 ఎకరాల్లో పత్తి , వరి పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు. జన్నారంలో 85 మంది రైతులకు సంబంధించి 15 ఎకరాలు పత్తి , 71 ఎకరాల వరి , చెన్నూర్లో 30 మంది రైతులకు సంబంధించి 100 ఎకరాల్లో పత్తి పంట నష్టం జరిగిందన్నారు. .పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అదుకుంటుదన్నారు.

(పిటిసి, మంచిర్యాల)

ఆసిఫాబాద్- ప్రాజెక్టులు

ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండు రోజులు తెరిపినిచ్చిన వర్షం నిన్న రాత్రి నుండి మళ్లీ ప్రారంభమైంది. దీంతో జిల్లాలోని కొమురం భీం ప్రాజెక్టు , వట్టివాగు ప్రాజెక్టుల నుంచి నీటిని కింది వదులుతున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు.

(ఆసిఫాబాద్ జిల్లా పిటిసి)

యాదాద్రి-మృతి

యాదాద్రి భువనగిరి జిల్లాలోని అడ్డగూడూరు మండలం మనాయికుంట గ్రామం లో నిన్న రాత్రి కురిసిన వర్షానికి వరదలో చిక్కుకొని బోడ ఐలమ్మ అనే వృద్ధురాలు మృతి చెందారు. వలిగొండ మండలం సంగెం గ్రామం శివారులోని బీమలింగం కత్వా వద్ద మూసీ నది లోలెవల్ బ్రిడ్జి మీద నుంచి ప్రవహిస్తోంది.

(పీటీసీ, యాదాద్రి భువనగిరి)